క్లుప్తంగా

సర్వీస్ నుంచి తొలగించాలి



ఆర్మూర్‌టౌన్: జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌పై కేసు నమోదు చేసి సర్వీస్ నుంచి తొలగించాలని ఎంఐఎం నాయకులు గురువారం ఏసీపీ ప్రభాకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ.. ఓ మైనార్టీ విద్యార్థినితో బస్సులో అమర్యాదకరంగా ప్రవర్తించి, బాధ్యతారాహిత్యంగా కొట్టి అవమాన పర్చారని ఫిర్యాదు పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

బాల్కొండ: కిసాన్‌నగర్‌లో జెడ్పీటీసీ నిధులు రూ.1.40 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం జెడ్పీటీసీ దాసరి లావణ్య ప్రారంభించారు. సర్పంచ్ మానేటి తులసీ, ఎంపీటీసీ రామారాజు గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవాలయ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని కోదండ రామాలయం, శివాలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ ఈవో వేణు హెచ్చరించారు. గురువారం దేవాలయ భూముల్లో నిర్మిస్తున్న ఇంటి పనులను నిలిపేశారు. ఆలయ భూముల్లో నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ నరహరి పాల్గొన్నారు.

అమరుడికి ఘన నివాళి



బోధన్: ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు, అమరుడు పడాల రాములు చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్)ప్రజపంథా నాయకులు గురువారం ఘన నివాళులర్పించారు. పట్టణ కేంద్రంలో రాములు 20వ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ.. నిజాంసాగర్ ఆయకట్టు రక్షణ ఉద్యమం, నిజాం షుగర్ ఫ్యాక్టరీ భూములు పేదలకు పంచాలని జరిగిన పోరాటాల్లో క్రియాశీల పాత్ర పోషించారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



భీమ్‌గల్: మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ పేద ప్రజలకు మేలు చేకూరే విధంగా ఎన్నో పథకాలు తెస్తున్నారన్నారు.

మంత్రి ఆర్థిక సాయం



భీమ్‌గల్ : పల్లికొండ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు కర్రోళ్ల అనిల్ యాదవ్‌కు చెందిన 48 గొర్రెలు మృతి చెందడంతో పాటు, అనిల్‌కు స్వల్పంగా గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అనిల్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబానికి మనో ధైర్యం కల్పిస్తూ రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.

మంచి చదువుతోనే.. ఉత్తమ ఫలితాలు



బోధన్‌టౌన్(బోధన్): క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆర్డీవో రాజేశ్వర్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని విజయ సాయి పాఠశాలలో 10 జీపీఏ సాధించిన 14 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ..మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇతర విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి ఉన్నారు.

కార్యాలయాల తరలింపు ఎప్పుడో?

- డొంకేశ్వర్ మండలం ఏర్పడి ఆర్నెళ్లు
- ఒక తహసీల్ ఆఫీసు మాత్రమే ఏర్పాటు
- మిగతా శాఖల సేవలందక ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు



డొంకేశ్వర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ కొత్త మండలంగా ఏర్పడి దాదాపు ఆరు నెలలవుతోంది. ఒక తహసీల్ ఆఫీసు మాత్రమే ఏర్పాటైంది. మిగతా శాఖలను ఇక్కడికి తరలించలేదు. దీంతో మండల వాసులు తమ సొంత మండలంలో వివిధ రకాల ప్రభుత్వ సేవలను పొందలేకపోతున్నారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ లేకపోవడం సమస్యగా మారింది. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ, ఉపాధిహామీ, ఐసీడీఎస్, ఇరిగేషన్, వ్యవసాయ, తదితర శాఖలు ఏర్పాటు కావాల్సి ఉంది. ఈ శాఖల కోసం మండల కేంద్రంలో భవనాలు కూడా వెతికి ఉంచారు. కానీ, జిల్లా ఉన్నతాధికారులు సిబ్బందిని కేటాయించి శాఖలను తరలించలేదు. తద్వారా మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఒక్క రెవెన్యూ సేవలు మాత్రమే పొందుతున్నారు. ఇతర శాఖల సేవలు, పనుల కోసం మళ్లీ పాత మండలానికే పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త మండలం ఏర్పడినా ఇక్కడ సేవలు పొందలేకపోవడం పట్ల మండల వాసులు అసంతృప్తిగా ఉన్నారు. కనీసం పోలీస్ స్టేషన్ అయినా త్వరగా ఏర్పాటు చేస్తే బాగుండేదని అంటున్నారు. ఇటు పోలీసులకు కూడా నందిపేట్ నుంచి డొంకేశ్వర్ వరకు రావాలంటే సమయం ఎక్కువ పడుతోంది. దీంతో అత్యవసర సేవలు ఆలస్యమవుతున్నాయి. అలాగే వ్యవసాయ, ఉపాధిహామీ పనులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు, కూలీలు పాత మండలానికే పయమవుతున్నారు. మహిళా సంఘాల సభ్యులు సైతం మండల సమాఖ్య సమావేశాలకు నందిపేట్‌కు వెళ్తున్నారు.

ఇబ్బంది అవుతోంది



అన్ని ఆఫీసులు లేక మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ సేవలు తప్ప మిగతా సేవల కోసం పాత మండలానికే వెళ్లాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి పోలీస్ స్టేషన్‌తో సహా అన్ని ఆఫీసులు త్వరగా ఏర్పాటు చేయాలి.

– గంగారాం, డొంకేశ్వర్

నీచరాజకీయాలు మానుకోవాలి



రూరల్ ఎస్సై సందీప్‌నకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో..

బోధన్‌రూరల్(బోధన్): బీజేపీ నాయకులు నీచ రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ సాలూర మండలాధ్యక్షుడు నరేంద్రబాబు, ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్‌లు అన్నారు. సాలూర, బోధన్ మండలంలో పలుచోట్ల 'జాడలేని బోధన్ ఎమ్మెల్యే షకీల్' అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై గురువారం బోధన్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చట్టరీత్యా చర్యలు తీసుకోండి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కనపడటం లేదని బీఆర్ఎస్ నాయకుల మనోభావాలు దెబ్బతినేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన బీజేపీ నేతలు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డిలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. గురువారం పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై నవీన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

రైతులను ఆదుకుందాం.. రాజకీయం వద్దు

బోధన్‌టౌన్(బోధన్): రైతులను ఆదుకుందామని, వారితో రాజకీయం చేయవద్దని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మాట్లాడారు. బీజేపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెట్టి అప్రతిష్ఠ పాలు చేస్తున్నారని, ఇకపై అలాంటి పోస్టులు పెడితే సహించేది లేదన్నారు.

నవీపేటలో..

నవీపేట: ఎమ్మెల్యే షకీల్‌ను అవమానపరిచే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు సాయికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగేపూర్ ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నేతలు అర్షద్, సాయితేజ, శివ, సురేష్‌లు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఏలేటి ఆరోపణలు

వేల్పూర్: రాజకీయ లబ్ధి కోసమే అక్లూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం జరగడం లేదని బీజేపీ నేత ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆరోపణలు చేశారని మోతె, అక్లూర్ బీఆర్ఎస్ నేతలు గురువారం పేర్కొన్నారు. మోతె సొసైటీ చైర్మన్ రాజేశ్వర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగధర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. తూకం వేసిన వడ్లు ఏ రైసుమిల్లుకు వెళ్లాయో చూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై బురదజల్లడమే ఆయన పనిగా పెట్టుకున్నాడని ఆరోపించారు.

గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేయాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న, సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కోల వెంకటేష్ అన్నారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయికి బానిసవుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి సరైన మార్గంలో నడిచేలా చూడాలన్నారు. యువత ఊరి చివరలో ఉన్న నిర్మానుష్య ప్రదేశాలలో గంజాయి సేవిస్తున్నారని, ఆ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మీర్ మాజీద్, మందుల పోశెట్టి, మీసాల రవి, హబీబ్ పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి



వర్ని: వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని వర్ని తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గురువారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ విఠల్‌కు అందజేశారు. 55 ఏళ్లు పైబడిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్ ఇస్తూ, డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

బీజేపీ నేతలతో పెట్టుకుంటే తరిమి కొడతాం

- ఎడపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు కమలాకర్ రెడ్డి



మొలకెత్తిన ధాన్యాన్ని చూపెడుతున్న నేతలు

ఎడపల్లి(బోధన్) : తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామన్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ కనబడటం లేదని కడుపు మండి రైతులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే, దానికి కారణం బీజేపీ నాయకులంటూ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడిన తీరును ఎడపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు కమలాకర్ రెడ్డి తప్పుబట్టారు. బీజేపీ నాయకులతో పెట్టుకుంటే తరిమి కొడతామని ఆయన హెచ్చరించారు. గురువారం ఠాణాకలాన్ శివారులో తడిసిన, మొలకెత్తిన ధాన్యంను పరిశీలించి ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీలు చించగానే నిజం దాగదని, తడిసిన ధాన్యాన్ని కొంటాం అంటూ ఎడపల్లి మండల కేంద్రం సాక్షిగా బోధన్ ఎమ్మెల్యే చేసిన ప్రకటన నిజం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రకటన చేసిన నాటి నుంచి ఇంతవరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే షకీల్ కనబడటం లేదంటూ ఫ్లెక్సీల ద్వారా తాము ప్రశ్నించిన దాంట్లో తప్పేముందని అడిగారు. బీఆర్ఎస్ నేతలకు రైతుల మీద ప్రేమ ఉంటే ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. నాయకులు ఉప్పు సురేష్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీతం పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి



బోధన్‌లో నిరసన తెలుపుతున్న వీవోఏలు

బోధన్‌రూరల్/మాక్లూర్/రెంజల్/నందిపేట : ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై సహృదయంతో స్పందించి రూ.18 వేలు వేతనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏలు అన్నారు. వీవోఏ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 18వ రోజుకు చేరుకుంది. వీవోఏలు సమ్మెలో కూర్చుని తమ సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరారు. బోధన్, మాక్లూర్, రెంజల్, నందిపేట మండలాల్లో వీవోఏలు సమ్మెను కొనసాగించారు.



మాక్లూర్‌లో..



రెంజల్‌లో..



నందిపేటలో..

పట్టణ బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణ బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, కన్వీనర్‌గా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను, మిగితా శాఖల నుంచి సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, అత్యాచారాలు, పిల్లల అమ్మకం, బాల కార్మికులు లేకుండా చూడాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాటా సొమ్ము చెల్లించండి

మాక్లూర్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సబ్సిడీ పోను ప్రతి లబ్ధిదారుడు రూ.43 వేల 750 నెఫ్ట్ ద్వారా చెల్లించాలని మండల పశు వైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే వెల్లడించారు. గురువారం చిన్నాపూర్‌లో జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారుల వాటా చెల్లింపులో ఇప్పటికే చాలా జాప్యం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశు వైద్యురాలు ఉమా సహెర్, స్థానిక ఎంపీటీసీ సత్యనారాయణ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్: ఆటో డ్రైవర్లు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు అన్నారు. ఆర్మూర్ కొత్త బస్టాండ్ వద్ద 'మై ఆటో మై సేఫ్' కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్ని ఆటోలు ఉన్నాయనే వివరాలను సేకరించారు. ఆటోడ్రైవర్లకు పోలీస్‌శాఖ ద్వారా ఇచ్చిన నెంబర్ ఆటోకు కచ్చితంగా ఉండాలన్నారు. ఎస్సై రాములు, సిబ్బంది ఉన్నారు.

పేద కుటుంబానికి అండగా నిలిచిన స్పీకర్



వర్ని: సత్యనారాయణపురం జీపీ పరిధిలోని రజాకాలనీకి చెందిన ఖాసిం కుటుంబానికి స్పీకర్ పోచారం పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. కొన్ని రోజుల క్రితం ఖాసిం భార్య ఫాజియా పర్వీన్ బిడ్డకు జన్మనిచ్చి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్పీకర్ పోచారం బాధిత కుటుంబం వద్దకు వెళ్లి ఓదార్చి వారికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసి వ్యక్తిగతంగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పసి పిల్లాడి ఆలనా పాలనా కోసం మరికొంత సాయం అందించారు.

ఇద్దరు వార్డు సభ్యుల రాజీనామా

నందిపేట్(ఆర్మూర్): తల్వేద గ్రామానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు తమ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం మండల పంచాయతీ అధికారి కిరణ్ కుమార్‌కు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. తల్వేద గ్రామానికి చెందిన 3వ వార్డు మెంబర్ సీతాల నర్సుబాయి, 12వ వార్డు మెంబర్ మంచిర్యాల నర్సయ్యలు తమ పదవులకు రాజీనామా చేశారు. బుధవారం 8వ వార్డు సభ్యురాలు సిర్నాపల్లి లత సైతం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెల్సిందే.. వారందరూ సర్పంచు, ఉప సర్పంచులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో వార్డు సభ్యులు ముగ్గురు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొనడం మండలంలో చర్చనీయాంశమైంది.

ఎన్‌ఎస్‌ఎఫ్ ఆస్తుల అమ్మకం నిలిపేయాలి

బోధన్: నిజాం షుగర్ ఫ్యాక్టరీ(ఎన్‌ఎస్‌ఎఫ్)కి చెందిన ఇనుప స్తంభాలు, ఇతర సామగ్రిని కోర్ కమిటీ చేపట్టిన అమ్మకాలను నిలిపి వేయాలని ఎన్డీఎస్ఎల్ మజ్దూర్ సభ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఉపేందర్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి గురువారం డిమాండ్ చేశారు. నడిచే ఫ్యాక్టరీని ప్రైవేట్ యాజమాన్యం అప్పగించగా 2015 డిసెంబర్ 23న లే ఆఫ్ ప్రకటించి మూసివేశారని పేర్కొన్నారు. లే ఆఫ్ నాటి నుంచి తమకు వేతనాలు చెల్లించడంలేదని, ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఇదివరకు స్క్రాప్ అమ్మిన డబ్బులను వేతనాల కింద కార్మికులకు చెల్లించాలని కోరారు.

విద్యతోనే మంచి భవిష్యత్తు



వార్షికోత్సవంలో భాగంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

బోధన్‌టౌన్(బోధన్): విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఆంజనేయులు అన్నారు. గురువారం పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్లో ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాలల 13వ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. సాందీపని డిగ్రీ విద్యాసంస్థల అధినేత హరిస్మరన్ రెడ్డి, వాగ్దేవి కళాశాల అధినేత సృజన్ రెడ్డి, ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్ పాల్గొన్నారు.

సమాచారం..

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

ఎడపల్లి(బోధన్): మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కొండెగల శ్రీనివాస్, ఎంపీడీవో గోపాల కృష్ణలు తెలిపారు. గురువారం ఎడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన క్రీడల నిర్వహణ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఆకుల శేఖర్, ఎంపీటీసీ మంద సంజీవ్ తదితరులు ఉన్నారు.

బాల్కొండ పరిధిలో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో, బాల్కొండ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 15 నుంచి సీఎం కప్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షులు సామ పద్మ, లావణ్యలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. స్థానిక పంచాయతీల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణపై గురువారం ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ నెల 15 నుంచి 17 వరకు క్రీడా పోటీలు మాక్లూర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 14లోపు మాక్లూర్ పీఈటీ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో క్రాంతి సూచించారు.

నవీపేటలో..

నవీపేట: ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ టోర్నమెంట్ దోహదం చేస్తుందని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంపీపీ ఛాంబర్‌లో బుధవారం కమిటీ ప్రతినిధులతో టోర్నమెంట్ నిర్వహణపై చర్చించారు. మండల స్థాయిలో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించే క్రీడలను సద్వినియోగం చేసువాలని సూచించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏఎస్సై యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆర్మూర్ నుంచి డొంకేశ్వర్‌కు బస్సు వేయండి



డొంకేశ్వర్(ఆర్మూర్): కొత్తగా ఏర్పడిన డొంకేశ్వర్ మండలానికి ఆర్మూర్ నుంచి నేరుగా ఆర్టీసీ బస్సును వేయాలని బీజేపీ సీనియర్ నాయకులు మారంపల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ నుంచి వయా వన్నెల్(కె), మారంపల్లి, నూత్‌పల్లి, గంగాసముందర్ గ్రామాల మీదుగా మండల కేంద్రం వరకు బస్సును నడిపితే బాగుంటుందన్నారు. ఈ విషయం ఇప్పటికే ఆర్టీసీ అధికారులకు పలు మార్లు విన్నవించామని, త్వరగా స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

ఇసుక అక్రమ రవాణపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌రూరల్(బోధన్): మంజీర పరివాహక ప్రాంతాలైన సిద్దాపూర్, ఖండ్‌గావ్ శివారులోని మంజీర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. గురువారం సమయపాలన లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకుని ఇసుకను ఖాళీ చేయించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది స్పందించి అక్రమ రవాణాను నిరోధించాలని కోరారు.

సీఎం, స్పీకర్, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం

రుద్రూర్: బోధన్ నుంచి రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మీదుగా మద్నూర్ వరకు రోడ్డును విస్తరిస్తూ నాలుగు లేన్ల రోడ్డు మంజూరుపై కోటగిరి ఉమ్మడి మండల బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్ చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, సర్పంచులు వర్ని శంకర్, పత్తి లక్ష్మణ్, మాధవరావు పటేల్, ఎంపీటీసీలు కేశ వీరేశం, అనంత విఠల్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం త్వరగా ఇవ్వాలని వినతి

వర్ని: పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రతి పేద కుటుంబానికి ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున త్వరగా పంపిణీ చేయాలని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వర్ని తహసీల్దార్ విఠల్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు లక్ష్మి, సావిత్రి, రాములు పాల్గొన్నారు.

సాలూరా పీహెచ్‌సీ సందర్శన

బోధన్‌రూరల్: సాలూరా పీహెచ్‌సీని గురువారం ఎన్‌కాస్(ఎన్‌క్యూఏఎస్) ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ బృందం సందర్శించింది. బృందం సభ్యులు డాక్టర్ మిథిలేష్ చాతుర్వేది, రోనిట్ బోరాలు పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా తీశారు. ఆరు విభాగాల్లో పీహెచ్‌సీలో సేవలపై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రాము, వైద్యురాలు సమత, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి శిబిరం ప్రారంభం

మాక్లూర్ : మండల కేంద్రంలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ మాస్త ప్రభాకర్ ప్రారంభించారు. మండల వైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిబిరం నెల రోజులు కొనసాగుతుందని ఈ సందర్భంగా మాస్త ప్రభాకర్ వెల్లడించారు. స్థానిక సర్పంచ్ అశోక్ రావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.